నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
08.
nipuna
Every Wednesday Free Supplement
21 మే 2025
పేజీలు 8

చెట్లను పునరుద్ధరించాలి

కంచ గచ్చిబౌలి భూముల్లో నరికేసిన చెట్లను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కోర్టు ధిక్కరణ చర్యల నుంచి తప్పించుకోవాలంటే అడవిని పునరుద్ధరించాల్సిందే అని స్పష్టం చేసింది. అక్కడ 100 ఎకరాల ప్రాంతంలో ధ్వంసం చేసిన పచ్చదనాన్ని పునరుద్ధరించాలని, అందుకు సంబంధించిన ప్రణాళికను నాలుగు వారాల్లోపు సమర్పించాలని ఆదేశిస్తూ ఏప్రిల్ 16న జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా ధర్మాసనం మే 15న తీర్పు చెప్పింది.

అంతర్జాతీయం

కంట్రీ చాంపియన్‌గా భారత్

- మే 5 నుంచి 8 వరకు ప్రపంచ బ్యాంక్ నిర్వహించిన భూ కాన్ఫరెన్స్‌లో భారతదేశం 'కంట్రీ చాంపియన్'గా నిలిచింది. భూ హక్కులు, పర్యావరణ పరిరక్షణ అనే లక్ష్యంతో దీన్ని నిర్వహించారు. భారత్‌లో అమలవుతున్న పీఎం స్వమిత్వ, గ్రామ్ మన్ చిత్రాలను ఈ సందర్భంగా ప్రపంచ దేశాల ఎదుట ప్రదర్శించారు.

క్రిప్టో కరెన్సీ చెల్లింపులు

- పర్యాటక రంగంలో క్రిప్టో కరెన్సీ చెల్లింపులను అనుమతిస్తూ భూటాన్ నిర్ణయం తీసుకుంది. ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ప్రపంచంలో తొలి దేశం భూటాన్. ఆ దేశ జాతీయ పర్యాటక విధానంలో క్రిప్టో కరెన్సీ భాగమైంది.

ఈ-మిథనాల్ ప్లాంట్

- ప్రపంచంలో తొలి వాణిజ్య ఈ-మిథనాల్ ప్లాంట్‌ను డెన్మార్క్‌లో మే 13న ప్రారంభించారు. నౌకా రంగంలో శూన్య ఉద్గారాలు సాధించాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్లాంట్‌ను ఆ దేశం అందుబాటులోకి తెచ్చింది.

అఫ్గానిస్థాన్

- చెస్ క్రీడను అధికారికంగా సస్పెండ్ చేస్తూ అఫ్గానిస్థాన్ నిర్ణయం తీసుకుంది. ఇస్లామిక్ చట్టాలకు, విశ్వాసాలకు ఈ క్రీడ అనుగుణంగా లేనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది.

ఒప్పందం సస్పెండ్

- తుర్కియేలోని ఇన్నోను విశ్వవిద్యాలయంతో కుదిరిన అవగాహన ఒప్పందాన్ని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ సస్పెండ్ చేసింది. దేశ భద్రత కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంది. భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ఆ దేశం విమర్శించడమే కాకుండా పాకిస్థాన్‌కు డ్రోన్లు, ఆయుధాలు, సైన్యం రూపంలో సాయం చేసింది.

జాతీయం

14 అంశాలతో రాష్ట్రపతి ప్రశ్న

- రాష్ట్ర శాసనసభలు పంపిన బిల్లుల ఆమోదానికి సంబంధించి గవర్నర్లు, రాష్ట్రపతికి కాల పరిమితులు విధిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పునకు సంబంధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పలు ప్రశ్నలను లేవనెత్తారు. రాజ్యాంగంలోని అధికరణం 143 (1) కింద 14 ప్రశ్నలను సుప్రీంకోర్టుకు సంధించారు. న్యాయ సలహా కోరారు.

చైనా చర్య ఖండన

- అరుణాచల్ ప్రదేశ్ తమదే అనడంతో పాటు దానికి పేరు పెట్టిన చైనా చర్యను భారత్ తీవ్రంగా ఖండించింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో భూభాగమే అని తేల్చి చెప్పింది. అలాగే భారత్‌కు వ్యతిరేకంగా, భారత సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించేలా పోస్టులు పెడుతున్న టీఆర్‌టీ, గ్లోబల్ టైమ్స్ తదితర ఖాతాలను భారత్ నిలిపివేసింది.

సెమీ కండక్టర్

- దేశంలో ఆరో సెమీ కండక్టర్ యూనిట్‌ను ఉత్తర్‌ప్రదేశ్‌లోని జెవార్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు రూ. 3700 కోట్లు కేటాయించారు. హెచ్‌సీఎల్-ఫాక్స్‌కాన్ సంయుక్తంగా దీన్ని ఏర్పాటు చేయనున్నాయి.



ఆయుర్వేద రోజు

- ఏటా సెప్టెంబర్ 23న ఆయుర్వేద రోజుగా నిర్వహించాలని ఆయుష్ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. గతంలో ధన్‌తెరాస్ రోజున ఆయుర్వేద రోజు నిర్వహించేవాళ్లు. ప్రతి సంవత్సరం తేదీలు మారుతూ ఉండటంతో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించేందుకు ఉన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నారు.

తపతి బేసిన్ రీచార్జ్ ప్రాజెక్ట్

- విదర్భతో పాటు ఇతర కరవు ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి మధ్య ప్రదేశ్, మహారాష్ట్రా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. నీటి ఎద్దడి ఉండే ఈ రెండు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో సాగునీరు కూడా అందనుంది. దేశంలోనే ఇది అతి పెద్ద నది రీచార్జ్ ప్రాజెక్ట్.

తెలంగాణ

ఐఐసీటీ శాస్త్రవేత్తకు ఫెలోషిప్

- ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ సూర్య ప్రకాశ్ సింగ్ 2025కు ప్రతిష్ఠాత్మక ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ విశిష్ట లెక్చర్ ఫెలోషిప్ అందుకున్నారు. దేశంలో అత్యుత్తమ పరిశోధనలు చేసిన యువ శాస్త్రవేత్తలకు దీన్ని ఇస్తారు. ఐఐసీటీ-సీఐఎస్ఆర్ పరిశోధకుడికి ఈ ఫెలోషిప్ రావడం ఇదే తొలిసారి. హైదరాబాద్ ప్రాంతానికి కూడా ఇదే మొదటిది కావడం విశేషం. సౌర సాంకేతికతల సామర్థ్యాన్ని పెంచేందుకు అధునాతన మాలిక్యులర్ పదార్థాలను ముఖ్యంగా ఫొటో సెన్సిటైజర్లను రూపొందించడంపై ఆయన విశేష కృషి చేశారు.

సరస్వతి పుష్కరాలు

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో మే 15న సరస్వతి నది పుష్కరాలు ప్రారంభమయ్యాయి. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో పుష్కరాలు మే 26 వరకు కొనసాగుతాయి. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశిస్తుండటంతో సరస్వతి నదికి పుష్కరాలు నిర్వహిస్తున్నారు.

లాజిస్టిక్స్ పార్క్

- మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పార్కిబండలో హైదరాబాద్ మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్‌కు కేంద్రం అనుమతి ఇచ్చింది. పనుల కోసం రూ. 996.63 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లను ఆహ్వానించింది. లాజిస్టిక్స్ పార్క్ కోసం ఇప్పటికే 315 ఎకరాల భూమిని గుర్తించింది. ఇది అందుబాటులోకి వస్తే సరకు రవాణా, సమీకరణ, పంపిణీ వంటి లాజిస్టిక్స్ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాంతంలో రైల్ టెర్మినల్, రైలు నుంచి రోడ్డు, రోడ్డు నుంచి రైలుకు సరకు మార్చే ఇంటర్ మోడల్ షిఫ్ట్, గోడౌన్లు, వాల్యూ యాడెడ్ సర్వీసులు, ట్రక్ పార్కింగ్‌లు, కమర్షియల్ ఏరియాలు ఏర్పాటు చేస్తారు. ఇక్కడి నుంచి మచిలీపట్నం పోర్టుకు నేరుగా సరకుల ఎగుమతులు, దిగుమతులు చేసుకోవచ్చు.

సానాటా సాఫ్ట్‌వేర్ కార్యాలయం

- హైదరాబాద్ నానక్‌రాంగూడలో సానాటా సాఫ్ట్‌వేర్ సంస్థ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించారు. కృత్రిమ మేధ నగరం, స్కిల్స్ యూనివర్సిటీలతో కూడిన భారత ఫ్యూచర్ సిటీని త్వరలో ఆవిష్కరించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా టీఎస్ఐఐసీ

- ఇప్పటి వరకు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ హోదాలో ఉన్న తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థను ప్రభుత్వ లిమిటెడ్ కంపెనీ హోదా కిందకు మార్చేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ప్రైవేట్ లిమిటెడ్ నుంచి పబ్లిక్ లిమిటెడ్‌కు ఎందుకు మారాల్సి వచ్చిందో కూడా అందులో వివరించారు. ప్రభుత్వం రూ. 10 వేల కోట్ల బాండ్లను సమకూర్చుకునేందుకు టీఎస్ఐఐసీకి అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ అనుమతి మేరకు టీఎస్ఐఐసీ రూ. 9995.28 కోట్ల బాండ్లను జారీ చేసింది. ఇందుకోసం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ అండ్ కంపెనీస్‌లో హై వాల్యు డెబ్ట్ లిస్టెడ్ ఎన్‌టీటీఎస్ జాబితాలో టీఎస్ ఐఐసీ నమోదు చేసుకుంది. ఈ బాండ్లు ఎక్కువ మంది పెట్టుబడిదారులకు చేరాలంటే ప్రైవేట్ లిమిటెడ్ నుంచి పబ్లిక్ లిమిటెడ్‌కు మార్చాలనే ప్రతిపాదన పెట్టుబడిదారుల నుంచి వచ్చింది.

ఆస్ట్రేలియా వర్సిటీతో కలిసి బీఎస్సీ కోర్స్

- ఆస్ట్రేలియాలోని వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీతో కలిసి సంయుక్తంగా నాలుగేళ్ల బీఎస్సీ అగ్రికల్చర్ కోర్స్ నిర్వహించాలని ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే దీన్ని ప్రారంభిస్తారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి అనుమతి మేరకు కోర్స్ నిర్వహణ వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీతో జయశంకర్ విశ్వవిద్యాలయం ఒప్పందం చేసుకుంది.

మాతృమరణాలు

- 2018-20లో తెలంగాణలో మాతృమరణాలు 43 ఉండగా, 2019-21కు 45కు పెరిగిందని కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జనగణన విభాగం తాజాగా విడుదల చేసిన శాంపిల్ రిజిస్ట్రేషన్ లెక్కలు చెబుతున్నాయి. అతి తక్కువ మాతృమరణాలు నమోదైన రాష్ట్రం కేరళ. 2030 నాటికి మాతృమరణాల నిష్పత్తిని 70కి తగ్గించాలన్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, జార్ఖండ్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలు సాధించాయి.

తగ్గిన జనన రేటు

- దేశ వ్యాప్తంగా కరోనా సమయంలో జననాల రేటు స్వల్పంగా తగ్గింది. 2021లో తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా నమోదైన జనన రిజిస్టర్ నివేదిక ప్రకారం ఈ వివరాలు వెల్లడయ్యాయి. తెలంగాణలో అంతకుముందు ఏడాదితో పోల్చితే 2021లో జననాల సంఖ్య 58 వేలు తగ్గింది. జిల్లాల వారీగా చూస్తే హైదరాబాద్‌లో అత్యధికంగా 95,668, ములుగులో అత్యల్పంగా 3866 జననాలు నమోదయ్యాయి. అదే సంవత్సరంలో 31 వేల మరణాలు అత్యధికంగా నమోదయ్యాయి.

రుమా సిన్హా

- గైనకాలజీ విభాగంలో వెయ్యి రోబోటిక్ సర్జరీలు పూర్తి చేసిన అపోలోకు చెందిన గైనకాలజీ, రోబోటిక్ వైద్యురాలు డాక్టర్ రుమా సిన్హా రికార్డ్ సృష్టించారు. దేశంలో ఒక వైద్యురాలు వెయ్యి రోబోటిక్ సర్జరీలు చేయడం ఇదే తొలిసారి.

రోజులు-ప్రాధాన్యం

మే 15

- ఏటా మే 15న ఉమ్మడి కుటుంబ వ్యవస్థల రోజుగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'సుస్థిరాభివృద్ధికి కుటుంబ అనుకూల విధానాలు: సామాజిక అభివృద్ధి దిశగా రెండో ప్రపంచ సమావేశం'.

మే 12

- ఏటా మే 12న 'మొక్కల సంరక్షణ రోజు'గా నిర్వహిస్తారు. అలాగే ఇదే రోజు అంతర్జాతీయ నర్సుల రోజుగా కూడా నిర్వహిస్తారు.

మే 11

- ఏటా మే 11న జాతీయ సాంకేతిక రోజుగా నిర్వహిస్తారు. 1998లో ఇదే రోజున భారత్ రెండోసారి అణు పరీక్షలను నిర్వహించింది. ఈ సంఘటనకు గుర్తుగా ఈ రోజును ఎంపిక చేశారు.

రహదారి భద్రత వారోత్సవం

- మే 12 నుంచి 18 వరకు రహదారి భద్రతా వారోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి నిర్వహించింది. ఈ ఏడాది 'నా నడక సురక్షితం.. నా సైక్లింగ్ సురక్షితం' అనే ఇతివృత్తాన్ని ఎంచుకుంది. రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు ఉద్దేశించిన వారోత్సవాలను ఏటా నిర్వహిస్తుంది. ఈ ఏడాదితో కలిపి ఇప్పటి వరకు ఎనిమిది సార్లు నిర్వహించారు.

వార్తల్లో వ్యక్తులు

బీఆర్ గవాయ్

- భారతదేశ 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవిని చేపట్టిన తొలి బౌద్ధ మతస్తుడు ఆయన. దళిత సామాజిక వర్గం నుంచి వచ్చి ప్రధాన న్యాయమూర్తి అయిన రెండో వ్యక్తి కూడా.

అజయ్ కుమార్

- యూపీఎస్సీ చైర్మన్‌గా మాజీ ఐఏఎస్ అధికారి అజయ్ కుమార్ నియమితులయ్యారు. ఆయన గతంలో రక్షణ శాఖకు కార్యదర్శిగా పనిచేశారు.

హర్వంశ్ చావ్లా

- బ్రిక్స్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చైర్మన్‌గా సీనియర్ లాయర్, అంతర్జాతీయ వాణిజ్య నిపుణుడు హర్వంశ్ చావ్లా నియమితులయ్యారు.

సుసాన్ లే

- ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా సుసాన్ లే అనే మహిళ ఎన్నికయ్యారు. ఆ దేశంలో ఈ పదవిని చేపట్టిన తొలి మహిళ ఆమె. లిబరల్ పార్టీకి చెందిన వ్యక్తి.

అనితా ఆనంద్

- కెనడా విదేశాంగ శాఖ మంత్రిగా భారత సంతతికి చెందిన అనితా ఆనంద్ నియమితులయ్యారు. క్యాబినెట్ హోదాలో ఆమె పని చేస్తారు.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411